తిరుగులేని నిశ్చయం

పాలడుగు
వెంకటేశ్వరరావు

'...ఆ అమ్మాయిని నీకిస్తారుట! చేసుకుంటావా? ఆ మధ్య మాటల సందర్భంలో మీ నాన్నతో అన్నాడట, అతను.' గుమ్మం ముందు కూర్చుని బియ్యంలో బెడ్డలు ఏరుతూవున్న పార్వతమ్మ చెప్పుకుపోతున్నది.

'నాకా...!?' కళ్ళు పెద్దవిచేసి చూశాడు రాధాకృష్ణ.

మరుక్షణం అతని కళ్ళు, కుర్చీలో బార చాపుకునివున్న తన కాళ్ళమీదికి పోయాయి. ఆ కాళ్ళు సన్నగా నిర్జీవంగా వేళ్ళాడిపోయి వున్నాయి. వాటినిచూచి కాసేపు జాలిపడుతూ వుండిపోయాడు రాధాకృష్ణ.

'అవునురా! ఏం? నీకేం తక్కువని? కాకపోతే మన అదృష్టం బాగులేక నీ కాళ్ళకి అట్లా అయింది. అవి తిరిగి తప్పకుండా బాగుపడతాయన్న ఆశ మీ నాన్నకీ, నాకూ వుంది.'

రాధాకృష్ణ మాట్లాడలేదు.

'డాక్టరుగారు చెప్పారట! ఏదో కొత్త మందు వచ్చిందట. అది మొదలు పెడతారట, వచ్చేనెలనుంచి. దేవుడు మేలుచేస్తే వొచ్చే ఏడాది ఈపాటికి నువ్వు మళ్ళీ శుభ్రంగా నడుస్తావు.'

రాధాకృష్ణకి ఆ మాటలమీద నమ్మకంలేపోయింది. రెండేళ్ళనుంచీ అనేకరకాల మందులు వాడారు. 'మర్దనా'లు చేసిచూశారు. 'కరెంటు'తో కూడా చికిత్సలు చేశారు. మద్రాసూ, హైదరాబాదులలో కూడా చాలా రోజులు వుండివచ్చారు

బాగవదని చెప్పినవాళ్ళు ఎవరూ లేరు. కాని బాగయే సూచనలే మృగ్యం.

'తన కాళ్ళవొంక చూస్తూ వుండిపోయాడు రాధాకృష్ణ. పొలంనుంచి వచ్చినట్టున్నాయి. దొడ్లో పశువుల అరికిడి అయింది. పార్వతమ్మ 'పాలేర్ని' కేకేసింది. వాటిని కట్టేసి 'కుడితి' పెట్టమని పురమాయించింది. దూడలు అరుస్తూ చెంగు చెంగున గంతులువేస్తున్నాయి, సాయం సంధ్యాసమయాన.

జాలిగా వాటి వంక చూస్తూ వుండిపోయాడు రాధాకృష్ణ.

రాధాకృష్ణ బి. ఏ. వరకూ చదివాడు. తల్లిదండ్రులకి వొక్కడే కొడుకు. అతని కంటె పెద్దదయిన ఆడపడుచువుంది. ఆమె సుఖంగా అత్తవారింట కాపురం చేసుకుంటూ వుంది.

'ఈ ఆలోచన అసలు మీకెందుకు కలిగిందమ్మా...?' చాలసేపయాక రాధాకృష్ణ నోటినుంచి ఆమాటలు వెలువడ్డాయి.

పార్వతమ్మ తలెత్తి కొడుకువంకే చూసింది, కళ్ళార్పకుండా. రాధాకృష్ణ భావం ఆమెకి అర్థమయింది.

'మనమేం అడగలేదు. అతనే అడిగాడట నాన్నగారిని. చూద్దామన్నారట. ఈయన.'

'ఆ అమ్మాయి అతనికేమవుతుందట? స్వంత చెల్లెలేనా?' రాధాకృష్ణ అడిగేడు.

'ఊహుఁ. తల్లీ తండ్రీ చిన్నప్పుడే పోయారట. అప్పట్నుంచీ అతనే చేరదీసి పెంచాడట. దూరపు బంధుత్వం. వాళ్ళింట్లోనే పెరిగిందట!'

'ఊహూఁ'

'పార్వతమ్మ లేచి లోపలికి వెళ్ళిపోయింది. బియ్యంచేట, లోపల పెట్టి ఆమె పాలుతియ్యటానికి దొడ్లోకి వెళ్ళింది.

రాధాకృష్ణ 'ప్రయాణ బండి'లో కూర్చుని ఆలోచనలోపడ్డాడు.

రెండేళ్ళ క్రితం తనూ అందరిలానే ఆడుతూపాడుతూ తిరిగాడు. భవిష్యత్తు మీద ఎన్నో ఆశలు. మనస్సునిండా ఆదర్శాలు. అందమయిన అమ్మాయిలను గురించి కలలూ కన్నాడు. వూహాసుందరిని వూహించుకుని ఎన్నో మేడలు కట్టుకున్నాడు. భవిష్యత్తు ఎంతో అందంగా కనపడింది.

బి. ఏ. పరీక్షలురాసి సెలవులకి తిరిగి వచ్చాడు, ఆ ఏడాది.

కాని......

రాగానే మంచాన పడ్డాడు. ఫెళ్ళున జ్వరం వచ్చింది. పదిరోజులపాటు మూసిన కన్ను తెరవకుండా పడిపోయాడు. అందరూ ఎంతో ఆందోళన పడ్డారు. పట్నం నుంచి డాక్టరు వచ్చి చికిత్స చేశాడు.

జ్వరం తగ్గింది. వొంట్లో సత్తువ వచ్చింది; కొన్ని రోజులయాక.

రాధాకృష్ణ మామూలు మనిషయినట్టే గాని...

రెండు కాళ్ళూ పడిపోయాయి. ఎండిపోయిన తోటకూర కాడల్లా వాడిలి, సన్నగా, వ్రేలాడాయి, కాళ్ళు. పనికి రాకుండాపోయాయి అతన్ని అవిటివాడిని చేసి. రెండేళ్ళనుంచీ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం శూన్యం.

అతని అవిటితనాన్ని ఎవరూ తీసెయ్యలేక పోయారు. వాస్తవాన్ని తరిచి చూసుకున్న రాధాకృష్ణ తన వూహాసుందరికి వీడ్కోలిచ్చాడు, 'గుడ్‌బై' చెప్పి. అతని వూహాసుందరి ఎక్కిన రైలు వెళ్ళిపోయింది. రాధాకృష్ణ ఎక్కలేక పోయాడు. నేలమీద, కిందనే కూర్చుండి వున్న అతని కాళ్ళు పని చెయ్యలేదు. రైలు వెళ్ళిపోయింది.

రాధాకృష్ణకి జీవితం మీద 'విరక్తి' కలగలేదుగాని, ఉదాసీనత కలగక తప్పలేదు. ఏమిటీ జీవితం? పగలు, రాత్రి—ఒకదాని వెంట ఒకటి దొర్లిపోతున్నాయి. జీవితం యాంత్రికంగా అనాకర్షణీయంగా గడిచిపోతున్నది. ఏ ఆశా లేదు. గుండెల్లో దాచుకున్న, గతానికి సంబంధించిన, మధుర స్మృతులే అతను నిలుపుకున్న ఆస్తి. తియ్యటి అనుభవాలే, అతను నిలుపుకున్నది.

వీధిలో నుండి కలకలం వినిపించింది.

పిల్లలు ఆడుకుంటూ వున్నారు.

ఆ అమ్మాయి, గుమ్మంలో నుంచుని వాళ్ళ ఆటల్ని చూస్తూ వుంది, అప్పుడప్పుడు అమాయికంగా నవ్వులు వెదజల్లుతూ. ఆ విషయం ఆ అమ్మాయికి తెలుసా...?

పెద్ద పెద్ద కన్నులు సన్నగా ముందుకు సాగిన సంపెంగ పూవువంటి ముక్కు. ఎర్రగా అందంగా ముడుచుకున్న పెదిమలు, నవ్వితే అందంగా సొట్టలుపడే బుగ్గలు. తాచుపాము వంటి నల్లటివాల్జడ.

ఆ అమ్మాయి కనులలో కలలు ప్రతిఫలిస్తున్నాయి! ఆకలల్ని ఆవరించిన చీకటి తెరల్లా, కాటుక రేఖలు! ఆ అమ్మాయిని చాలా రోజుల్నించీ చూస్తున్నాడు రాధాకృష్ణ.

అంతలో, చటుక్కున ఆ అమ్మాయి లోపలికి వెళ్ళిపోయింది.

'అతనూ,' అతని భార్యా గుమ్మం ఎక్కుతున్నారు.

ఆర్నెల్ల క్రితం 'అతనికి' ఈ వూరు ట్రాన్స్‌ఫరయింది. 'బ్యాంకు'లో చిన్న ఉద్యోగమట! నలుగురు పిల్లలు. చాలీ చాలని జీతం. భార్యమాట జవదాటడని అంటారు. అక్కడికీ సర్దేటూరు గనుక ఎలాగో గడుపుకొస్తున్నారట!

రాధాకృష్ణకి అతను తెలుసు. ఒకటి రెండుసార్లు ఇంటికి వచ్చి అతను రాధాకృష్ణతో కూడా మాట్లాడాడు.

సన్నగా గాలికి పడిపోయేటట్లున్న శరీరం. అదుపులేకుండా ఎదిగి జీబుగా తయారయిన జుట్టు. గారపట్టిన పళ్ళు. పేదరికం అతని వేషంలోనూ మాటల్లోనూ కొట్టొచ్చినట్టు కనబడింది.

చాలా కలివిడిగా మాట్లాడాడు. సంసార బాధ్యతలు అతని నడుం వంచేయి. అతని బుజాలు కిందికి దిగినట్టనిపించింది రాధాకృష్ణ కి.

తన కున్నబాధ్యతలకి తోడు ఆ అమ్మాయి అతనికి మరింత భారంగా తయారయినట్టు అనిపించింది, అతనిమాటలవల్ల! అతనిపేరు సత్యమట!

సత్యమూ, అతనిభార్యా లోపలికివెళ్ళారు.

తిరిగి వీధిలో పిల్లలు గోలగా ఆడుకుంటున్నారు.

ఇంటిముందు బండి ఆగింది.

బండిలోంచి రామలక్ష్మి ఆమె భర్తా దిగారు.

ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు రాధాకృష్ణ.

రామలక్ష్మి చిరునవ్వు నవ్వుతూ లోపలికి వచ్చింది. వెనకే తోకల్లా చిట్టిగాడూ, బుజ్జీ.

'తమ్ముడూ! ఎట్లావున్నావురా?' నోరారా పలకరించింది రామలక్ష్మి.

'బాగానేవున్నానక్కా! బావేడి?' రాధాకృష్ణ ఆనందంగా అన్నాడు.

'వీధిలో నన్ను కనబడితే మాట్లాడుతూ వుండిపోయారు. అమ్మేక్కడ?' అంటూ లోపలికి వెళ్ళింది రామలక్ష్మి పిల్లలతో.

మర్నాడు ఉదయంవరకూ వాళ్ళెందుకొచ్చిందీ అర్థంకాలేదు రాధాకృష్ణకి.

ఆరాత్రల్లా ఆ అమ్మాయిని గురించిన ఆలోచనలు రాధాకృష్ణని కలవరపరిచాయి. కళ్ళుమూసుకుని పడుకోవటానికి ప్రయత్నించినా నిద్రరాలేదు.

తనేమిటో, తనపరిస్థితి ఏమిటో రాధాకృష్ణకి తెలుసు. గత్యంతరంలేక ఆ అమ్మాయిని ఎవరిచేతుల్లోనయినా పెట్టి బాధ్యత వొదుల్చుకోవాలని సత్యం తాపత్రయం. కొడుకు అవిటివాడయాడు. అమ్మాయి బాగానే ఉంటుంది. సంప్రదాయకమయిన కుటుంబం. కొడుకు ఒక ఇంటివాడయితే చాలునన్న తలిదండ్రుల ఆదుర్దా — ఎవరి తాపత్రయం వారిది.

కాని...తనేమిటో తన పరిస్థితేమిటో రాధాకృష్ణకి తెలుసు. చూస్తూ చూస్తూ ఆ అమ్మాయి గొంతు కొయ్యటం అన్యాయమనిపించింది రాధాకృష్ణ కి. మనస్ఫూర్తిగా తనని పెళ్ళిచేసుకోవటానికి ఆ అమ్మాయి వొప్పుకుంటుందని సరిపెట్టుకోవటం ఆత్మవంచనే!

అందుకే,

ఆ నిర్ణయానికి వచ్చాడు రాధాకృష్ణ. రాత్రి నిద్ర పట్టేసరికి బాగా ప్రొద్దుపోయింది. మర్నాడు రాధాకృష్ణ లేచేసరికి

ప్రొద్దెక్కింది, ఇల్లంతా సందడిగా వుంది. దొడ్లో పశువులు అరుస్తున్నాయి. దూడలు గంతులు వేస్తున్నాయి. పాలేరు కేకలు.

'తమ్ముడూ, లేచావా?'— దగ్గరకువచ్చి కూర్చుంది రామలక్ష్మి.

'ఏమోయ్! రాత్రి మేము ఇంటికివచ్చేసరికే నిద్రపోయావు. అప్పుడే పెళ్ళికొడుకు కళ వచ్చేసిందే? ఎట్లా వున్నావు?' సుబ్బరామయ్యవచ్చి మంచం పక్కనే నిలబడ్డారు.

'కూర్చోండి బావా!'—అన్నాడు రాధాకృష్ణ. నోరు పెగుల్చుకుని.

కాసేపు సర్దాగా మాట్లాడి సుబ్బరామయ్యగారు వెళ్ళిపోయారు, బయట్నించి రామ్మూర్తిగారు పిలవటం వలన.

హాల్లో హడావుడిగావుంది. ఎవరెవరివో గొంతులు వినబడ్డాయి. సత్యము గొంతుని ఆనవాలుపట్టాడు రాధాకృష్ణ.

'ఏమిటది, అక్కా!' అన్నాడు రాధాకృష్ణ.

'నీకూ తెలీనట్టుగా? తాంబూలాలు పుచ్చుకుంటున్నారు. నువ్వూ మొహం కడుక్కొని, కాఫీతాగు.'

అంటూ లేవబోయింది రామలక్ష్మి.

రాధాకృష్ణ, నోటివెంట మాటరాలేదు.!

'కాసేపాగక్కా!' అని చెయ్యిపట్టుకుని ఆపాడు. రామలక్ష్మి తమ్ముడి ప్రక్కనే కూర్చుండిపోయింది.

'మనకీ ఒక చెల్లెలువుంటే ఎంతబాగుండేది?!'

'అవును.'

తిరుగులేని నిశ్చయం

'అదీ పధ్నాలుగేళ్ళా పెరిగి, పెద్దదయితే, మంచి సంబంధం మాటాడి, ఇటాగే తాంబూలాలు పుచ్చుకుంటున్నప్పుడు, మనకీ ఎంత సంతోషంగా వుండేదో?'

'ప్చ్. అవున్నా!'

'కాని..., పెళ్ళికొడుకు ఏదో 'అవకరం' ఉన్నవాడైనప్పటికీ, మనకి వేరే గత్యంతరం లేక మన చెల్లెల్ని అతనికే ఇవ్వక తప్పనప్పుడు, మనం అంతగానూ బాధపడతాము. పైకి చెప్పలేకపోయినా—మనస్సులో—మన చెల్లెలూ ఎంతో బాధపడుతూ వుందని మనం తేలిగ్గా అర్థంచేసుకోగలము. అప్పుడు మన గుండెలు ఎంతో బరువుగా మూల్గుతాయి! కదక్కా...?'

రామలక్ష్మి ఆదుర్దాగా, ఆశ్చర్యంగా అతనివంక చూసింది!

'నువ్వనే దేమిటి?!'

రాధాకృష్ణ నవ్వాడు. 'నీకు అర్థంగాకే అడుగుతున్నావా?', అన్నాడు.

'నేనీ ప్రొద్దుటే ఆ అమ్మాయిని చూశాను. ఎంతో సంతోషంగా వుంది, చక్కగా మాటాడింది. ఆ విషయామూ అడిగాను. సిగ్గుపడింది. కాని నిన్నుచేసుకోవటానికి ఆ అమ్మాయి మనస్ఫూర్తిగా వొప్పుకున్నదని నేను నిర్ధారణగా చెప్పగలను. నామాట నమ్ము.'—అంది రామలక్ష్మి వాత్సల్యంగా చూస్తూ.



'నాకు వొక సహాయం చెయ్యగలవా, అక్కా!' మౌనాన్ని భగ్నంచేశాడు రాధాకృష్ణ.

'ఏమిటది?'

'ఈ పెళ్ళి నాకిష్టంలేదు. ఏదోరకంగా ఇది కాకుండా చూడు.'

రామలక్ష్మి తెల్లబోయింది.!

'నీకు పిచ్చెక్కినట్లుంది. లేకపోతే, పిచ్చి దాన్నిచేసి నవ్వాడిస్తున్నావా?' అని గభాలున లేచిపోయింది రామలక్ష్మి.

నిస్సహాయంగా ఆమె వెళ్ళినవైపే చూపి, దంతధావనంలో పడ్డాడు రాధాకృష్ణ, తన కోసం ఆ అమ్మాయిని బలిచెయ్యలేడు రాధాకృష్ణ. కాని, తనమాట ఎవరూ నమ్మటం లేదు. ఆ అమ్మాయి వొప్పుకున్నా తను ఇష్టపడవద్దా?!!

'పెళ్ళికొడుకుగారు ఇంకా కొన్నాళ్ళు వోపికపట్టాలి. ఇప్పట్లో ముహూర్తాలు లేవట! ఇవాళకూడా అంత మంచిరోజు కాదేమోనని సందేహము వచ్చింది. రామూర్తి పంతులుగారికి.. అందుకే వొచ్చేవారం గాని తాంబూలాలు పుచ్చుకోరుట! రెండ్నెల్లాగితేగాని పెళ్ళికాదు.' సుబ్బరామయ్యగారు గాలిలాగా లోపలికి వచ్చారు.

'పోన్లె బావా! అదీ మన మంచికే జరిగింది.' తృప్తిగా అన్నాడు రాధాకృష్ణ.

'ఏం? అప్పుడే విరహమల్లా విరక్తిగా మారిందా?!' నవ్వాడాయన.

'ఏం లేదు బావా! అన్నీ మన మంచికే అంటారుగదా! ఈలోగా వీరా మనసులూ మారవచ్చునేమో! అప్పటికయినా మీరంతా నన్నర్థం చేసుకోగలరేమో.'

'అదేమిటి? ఈ పెళ్ళి నీకిష్టం లేదా...? లేక నాతో వేళాకోళమాడుతున్నావా?' నవ్వాడాయన. రాధాకృష్ణ మాట్లాడకుండా వుండిపోయాడు. వేళాకోళంగానే అతనామాటలన్నాడనుకుని సుబ్బరామయ్య వెళ్ళిపోయాడు. రామలక్ష్మి కాఫీ తెచ్చి ఇచ్చింది. కాఫీ తాగి బయటికే చూస్తూ వుండిపోయాడు రాధాకృష్ణ. అతని దృష్టి అకస్మాత్తుగా ఆ ఇంటి గుమ్మంముందు పడింది.

గుమ్మాన్ని కడిగి, పసుపురాసి కుంకుమ అద్దుతున్నది ఆ అమ్మాయి.

రాధాకృష్ణ కిటికీలోంచి అలాగే చూస్తూ వుండిపోయాడు. ఆలోచనల్నుంచి అతను బయటపడేసరికి ఆ అమ్మాయి అక్కడ లేదు.

మనస్సు ఆ అమ్మాయి పిడల కృతజ్ఞతతో పడ్డాడు అతను.
నిండి, దీర్ఘంగా నిట్టూర్చాడు రాధాకృష్ణ. తన సంగతెరిగీ ఎట్లా ఇష్టపడిందా అమ్మాయి!? ఆ తరువాత వారం రోజులు ఆ అమ్మాయి బయటికి రాలేదు. రామలక్ష్మి సుబ్బరామయ్యా తిరిగి 'ఆ నాటికి' వస్తామని, ఆ రోజే వెళ్ళిపోయారు. సందడి లేక ఇల్లు బావురు మంది.

మనస్సులో వెలితిగా అనిపించింది రాధాకృష్ణకి. ఆ క్రితం రోజు మంచి డాక్టరు ఆ ఇంటికి 'జట్కా'లో వచ్చి పోతూండటం గమనించాడు రాధాకృష్ణ.

ఏమయింది?

ఎవరికన్నా జబ్బా...?

సత్యంగానీ, అతని భార్యగానీ జబ్బు పడ్డారేమో? లేక పిల్లలకేమయినా 'నలత'గా వుందేమో?!

పార్వతమ్మని అడుగుదామనిపించింది గాని అడగలేకపోయాడు రాధాకృష్ణ. పదిరోజులు గిర్రున తిరిగాయి.

ఆ అమ్మాయి కనబడక అదోకలాగు కనిపించింది రాధాకృష్ణకి.

చక్రాల బండిలో కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు రాధాకృష్ణ. పార్వతమ్మ గుమ్మం దగ్గర కూర్చుని వుంది.

'ఆ రోజు తాంబూలాలు పుచ్చుకోక పోవటం మంచిదయిందంటున్నారురా మీ నాన్న...' పార్వతమ్మ అంది.

'...........!!' తలెత్తి చూశాడు రాధాకృష్ణ.

'నీకు ఈ సంగతి నేను చెప్పలేదా? లలితకి జ్వరం వచ్చింది, పాపం!'

'లలితా...!??'

'అదేరా. సత్యం చెల్లెలు. నీకు చేసుకుందామనుకున్నాముగదా ఈ మధ్య!'

'ఆ అమ్మాయా? పాపం! జ్వరమా? అందుకేనేమో కనబడటములేదు. ఒకసారి వెళ్ళి చూసి రాలేకపోయావా?' రాధాకృష్ణ గుండెలు అదుర్దాగా కొట్టుకున్నాయి.

'ఇవాళే వెళ్ళాను. ఇన్నాళ్ళనుంచీ వెళ్దామనుకుంటూనే వీలుపడలేదు. నాల్గురోజుల క్రితం ఆ అమ్మాయి బ్రతుకుతుందనే ఆశ కూడాలేదట! ఇప్పుడు ఫరవాలేదు. ప్రాణానికి భయంలేదు, కాని...'

'ఏంజబ్బట! ఎదురిల్లేగదా! ఇన్నాళ్ళనించీ ఎందుకు వెళ్ళలేదమ్మా...?' బాధ

'భయమేసిందిరా! అందుకేగదా మంచి నీళ్ళు, కాచుకుని తాగుతున్నాము. ఈ పదిహేనురోజులూ నా ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకున్నాననుకో!'

'అదేం? ఎందుకమ్మా?'

'అవునురా. ఆ జబ్బు అట్లాంటిది! మొహమంతా భయంకరమయిన మచ్చలు. ఎర్రటి వొంటిరంగు కాస్తా నల్లపడి పోయింది! లలిత పూర్తిగా మారిపోయింది. ఆనవాలు పట్టలేము! ఎంత వికారంగా వుందంటే...' పార్వతమ్మ ఆగింది.

'పాపం!'

రాధాకృష్ణ గుండెల్లో జాలి తొణికిసలాడింది. లలిత...! అట్లా అయిపోయిందా? అట్లాంటిది వూహించటానికే వాళ్ళు 'గగుర్పాటు' చెందుతుందే...? ఆజబ్బు లలితని మానసికంగా ఎంత కృంగదీస్తోందో? పాపం. మంచివాళ్ళకేనా? కష్టాలు. చివరికి ఆ అమ్మాయికి మిగిలివున్న ఆ అందాన్ని చూసీ ఎవరికనులు కుట్టాయి? అట్లా ఎందుకయింది?'

పాపం! లలిత! తన సంగతెరిగీ తనని ఇష్టపడిన లలిత అట్లా అయిపోయిందా? రాధాకృష్ణ గుండెలు బరువుగా మూలిగాయ్, బాధనిండి.

'పోన్లేరా! బాధపడకు. ఇంకా నయం. ఇంటికి తెచ్చుకున్నాక అట్లా అయింది కాదు. అంతవరకూ అదృష్టమేననుకోవాలి. అమ్మాటే మీనాన్నా అన్నారు. అంతా మనమంచికే జరిగింది.' — పార్వతమ్మ తృప్తిగా అంది. రాధాకృష్ణకి నవ్వు వచ్చింది ఆమె మాటలువిని.

'అవునమ్మా! అంతా మన మంచికే జరిగింది. లలితకి నయమయింది. అదే పదివేలు! నీ కోడల్ని నీ ఇష్టంలేకుండా 'మృత్యువూ! ఎట్లా ఎత్తుకుపోతుంది?' అన్నాడు రాధాకృష్ణ నవ్వుతూ.

'అదేమిట్రా?!' పార్వతమ్మ ఆశ్చర్యపోయింది!

'అవునమ్మా! లలిత ఆనాడే ఈ ఇంటి కోడలయింది! అందమేమయినా కొరుక్కు తింటామా? రేపు నాకే అట్లా అయితే నన్ను బయటికి పొమ్మనలేవుగదా! అమ్మా! నీకొడుకుని నాలుగుకాలాలపాటు ప్రేమగా చూసుకోగల కోడలు దొరికినందుకు సంతోషించమ్మా! లలిత నిజంగా మంచిపిల్ల. ఇవాళ అందంలేదని మనం కాదంటే రేపు ఆపిల్లగతి ఏమిటి? ఇంకొకమ్మాయిని కోడలుగా చేసుకున్నా ఆమెకీ అట్లాగే ఐతే?! లలిత మనస్సు అందమయింది! నా 'అవకరాన్ని' చూసికూడా నన్ను నిరాకరించలేదు!! అక్కడ ఆ విషయం అప్పుడే నిర్ధారణ చేసుకుంది. నాకు అటువంటి భార్యే కావాలి, అమ్మా! మనస్వార్థమే మనం చూసుకుంటే మనల్ని దేవుడు క్షమించడమ్మా!'

పార్వతమ్మ మాట్లాడలేదు. తిరుగులేని ఆనిశ్చయం, రాధాకృష్ణ మొహంలో కొత్త వెలుగులు విరజిమ్మింది.